మీసాలు మెలిబెట్టటం చూసి ఎక్కడి వాళ్ళక్కడ సర్దుకున్నారు.

దుమ్ము రేపుతూ బస్సు చిత్తూరువేపు కదలిపోయింది.

"థూత్ పాడు బస్సు. దుమ్మంతా కంట్లో కొట్టింది!" అంటూ పక్కకు తప్పుకున్నాడు భీమన్న, తా నింతవరకూ ప్రయాణం చేసింది ఇందులోనేనని మరచిపోయి.

పక్కనే టీ బంకులో గ్లాసులు గలగల మంటున్నాయి. ముఖం కడుక్కుని పైగుడ్డతో తుడుచుకుంటూ లోపలికి వెళ్ళాడు. నాలు గయిదు బల్లలు వరుసగ్గా ఉన్నాయి. పది పదిహేనుమంది లోపల కబుర్లాడుతూ గొంతు తడుపుకుంటున్నారు.

బల్లమీద కూర్చుని భీమన్న బజ్జీలు తెమ్మన్నాడు. ఆవంక ఎవరో రాజకీయాల్లో మునిగి తేలుతున్నారు. ఎదురుగా కొందరు పేకాడుతున్నారు. ప్రక్కనే ఇంకెవరో కాలుమీద కాలు వేసుకుని ప్రశాంతంగా చుట్ట తాగుతూ ఆ పొగతోపాటు ఊహాలోకాల్లో తేలిపోతున్నారు.

భీమన్న బజ్జీలు తిని, టీ తాగి తాపీగా బీడీ వెలిగించాడు. అప్పటికే చీకట్లలుముకుంటున్నాయి.

"టైమెంతయిందన్నా?" ఎవరో అడుగుతున్నారు.

"ఏడు మినిట్లు తక్కువ ఏడు."

డబ్బిచ్చి వెలుపలికి వచ్చాడు. వీధిలో లైట్లు వెలుగుదామా, ఆరిపోదామా అన్న సందిగ్ధావస్థలో ఉన్నాయి.

చుట్టూ చూసి తన దోవన కదిలాడు. మిన్ను విరిగి మీదబడ్డా తను ఈ రాత్రికి పాళెం వెళ్ళాలి. అంటే ఐదు మైళ్ళన్నమాట. మరి ఈ దేహాన్ని కదిలించుకు వెళ్ళాలంటే కనీసం గంటన్నర, రెండు గంటలైనా పడుతుంది. దోవ బాగున్నా కాలం బాగులేదు. అదీగాక ఆ మర్రిచెట్టు దగ్గ రేదో దయ్యం తిరుగుతున్నట్లు రెండు నెల్ల నుంచీ ఒకటే పుకారు. మొన్ననగా మొన్న ఆ చాకలి ఎల్లయ్య వీపుమీద ఎక్కి కూచుని మైలు దూరం స్వారి చేసిందట. ఇంతవరకూ మళ్ళీ వాడు పక్కమీంచి లేవలేదు. ఎట్లా గబ్బా పోవటం? పోతే దయ్యం భయం... పోకుంటే పని చేటు....ఎవరైనా తోడున్నా బాగుండునే!

భీమన్న మళ్ళీ వెనక్కు వచ్చాడు. అటూ ఇటూ కాసేపు తచ్చాడాడు. ఇంకాసేపు చూస్తే ఏదన్నా బండిగానీ, మనుషులు గానీ అటువైపు వెళ్ళకపోతారా అనిపించింది. ఆ ధీమాతో మళ్ళీ టీ బంకులో ప్రవేశించాడు. బల్లమీద కూచుని బీడీలు తాగుతున్నాడు. తన కేమో దేహబలం ఉందిగానీ గుండెబలం లేక పోయె. భీమన్న తనలో తానే నవ్వుకున్నాడు. ఇంతలో ఆ దయ్యం గుర్తుకు వచ్చింది. కళ్ళు తిరిగినట్లయింది. ఇంకో బీడీ వెలిగించాడు. చల్ల గాలిలో మగత నిద్ర కమ్ముకొస్తున్నది.

*భయం మానవులకు సహజమైనది. ఇట్టే లోబరచుకొంటుంది. ఏంటో నిమిత్తం లేదు భయానికి. భయపడనివారు ఎవరూ భయానికి అతీతులు కాలేరు చిత్రమైనదీ ప్రకృతి!*

పొయ్యిలో కట్టెలు మండటం ఆగిపొయ్యాయి. యజమాని ఊదుగొట్టంతో ఊదుతున్నాడు. దట్టంగా పొగ అలుముకుంది. భీమన్న కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కళ్ళు తుడుస్తుంటే ఆవులింత వచ్చింది.

భీమన్న కళ్ళు మూతలు పడుతున్నాయి. తూగటంలో బీడీ కొన నుదుటికి తగిలి చురుక్కుమంది. కళ్ళు తెరిచేప్పటికి కొట్టు యజమాని నవ్వుతున్నాడు.

"నిదరొస్తుంటే ఆ బల్లమీదే పడుకోన్నా" అన్నాడు.

తలకింద పైగుడ్డ, చుట్టబెట్టుకొని గుర కలు పెట్టాడు భీమన్న.

* * *

ఏదో లారీ పెద్దగా రొద చేసుకుంటూ ఆ పక్కగా పోయింది. ఆ శబ్దానికి అదిరిపడి లేచాడు భీమన్న.

"టైమెంతయుందన్నా?"

"తొమ్మిదిన్నర."

"అమ్మయ్యో!....చాలా రాత్రయిపోయిందే."

ఈ పాడు నిద్రలో తన పనే మరచిపోయాడు. ఈ రాత్రికి పాళెం వెళ్ళకపోతే నాయుడు గొంతు నులిమేస్తాడు. తోడులేకుండా వెళ్తే దారిలో దయ్యం!

"ఇటు పాళెం వేపెవరన్నా వెళ్ళారాన్నా?" అని అడిగాడు.

ఓ ఇరవై నిమిషాల్రకితమే ఎవరో అటువేపు వెళ్ళినట్టు ఆ కొట్టు యజమాని చెప్పాడు. ఐనా తను ఊళ్ళో లేనట్టు తెలిస్తే ఆ పుల్లయ్యగాడు తన ఇంట్లోనే మకాం వేస్తాడు.

భీమన్న ఉద్రేకంగా లేచాడు. ఇంకో టీ తాగాడు. మరో అణా బీడీలు కొన్నాడు. మళ్ళీ ఒళ్ళు విరుచుకున్నాడు.

'దీం దుంపతెగ! ఈ ముండ తన అలుసు కారణంగా తనని మోసం చేస్తున్నది. ఈపాటికి కబురంది వాడు వచ్చే ఉంటాడు. ఈ రాత్రికే వాళ్ళిద్దర్నీ చితకబొడిచెయ్యాలి.'

పాళెంవేపు అడుగులు త్వరగా వేస్తున్న భీమన్న పిడికిలి బిగించాడు. బొకరాయపేట పొలిమేరలు దాటాడు. కళ్ళు పొడుచుకున్నా కానరాని చీకటి. ఈ చీకట్లోనే అది చెయ్యరాని పనులు చేస్తూంటూంది....నడక జోరుగా సాగుతున్నది. పక్కనే కీచురాయి పిట్టలు అరుస్తున్నాయి. తను లేకపోతే ఇలావే ఆ పుల్లయ్యా, అదీ గుసగుస లాడుకుంటారు....ఈదురుగాలి ఆ మహాకాయాన్ని ఒరుసుకు పోతున్నది. నక్షత్రాలు ఒకదా న్నొకటి చూస్తూ నవ్వుకుంటున్నాయి...చెట్లు గాలిలో నాట్యం చేస్తున్నాయి. నడక సాగుతున్నది. రెండో ఫర్లాంగు రాయి దాటాడు భీమన్న. ఆ పుల్లయ్య సంగతి ఆలోచిస్తూ దయ్యాన్ని పూర్తిగా విస్మరించాడు. మూడో ఫర్లాంగు దాటాడు.

ఉన్నట్టుండి అతని గుండె కలుక్కుమంది. ముందు కిర్ కిర్ మని శబ్దం ఎవరో నడుస్తున్నట్టు. దయ్యమేమో! ఆయినా ఇంకా దయ్యాల మర్రి రాలేదుగా. ఎవరైనా చెప్పులు వేసుకు నడుస్తున్నారేమో! తనలాగే బాటసారైతే....

"ఎవరక్కడ వెళ్ళేది?" గట్టిగా కేక వేశాడు. ఒక పిట్ట కీచుమని అరుచుకుంటూ వెళ్ళింది.

ముందు నడుస్తున్న సవ్వడి ఆగిపోయింది. భీమన్న గబగబ వెళ్ళాడు. ఎదురుగా యింకెవరో ఎవర్రా వీడన్నట్టు చూస్తున్నాడు. పీలగా, పొడుగ్గా ఉన్నాడతను, భీమన్నకు అన్ని రకాల వ్యతిరేకంగా.

"ఏమన్నా? ఎందాకా ప్రయాణం?" భీమన్నే ముందు చొరవ చేసుకుని అడిగాడు.

"ఆ! పాళెందాకా వెళ్ళొద్దామని బయలు దేరాను....మరి నీవో?"

"నేనూ అందాకే. పదన్నా ఒకరి కొకరు తోడుగా వెళ్దాం."

"బీడీ ఉందా అన్నా?"

"లేకేం? ఇంద తీసుకో. అగ్గిపెట్టె కావాలా? అహ ఉందా? సర్లే!" చాలా ఆప్యాయతతో మాట్లాడుతున్నాడు భీమన్న.

"నీ పేరేంటన్నా?" బీడీ వెలిగిస్తూ అడిగాడతను.

"భీమన్న!"

"పేరుకు తగ్గట్టే ఉన్నావు సుమా!"

ఏడవలేక నవ్వుతూ భీమన్న అతని పేరేమిటని అడిగాడు.

"ఎంకయ్య!"

నడక కొద్దిదూరం సాగింది. ఎంకన్న త్వర త్వరగా అడుగులు వేస్తున్నాడు.

"కాస్త నెమ్మదిగా పోదామన్నా అయినా ఆలస్యం ఎలాగూ అయింది!" ఆయాసపడుతూ అన్నాడు భీమన్న.

**ఎమ్. విశ్వనాథరావు**

"అలాగేలే. మరి పొలెం ఎందు కెళ్తున్నట్టు?" వేగం తగ్గించి అడిగాడు వెంకన్న.

"అబ్బే! అటు తిరపతిదాకా పనిమీద వెళ్ళి వస్తున్నా."

"ఇటేపు పంట లెలా ఉన్నయ్యన్నా?"

"ఆ ఏముందీ? బూడిద.....రెండేళ్ళనించీ వానా చుక్క లేదుగదా.....మరీ జొన్న, వెన్కాయి పడ పట్టేపోయినయ్."

రెండో మైలు దాటాక ఒంటే భీమన్న బెరుగ్గా అన్నాడు: "వెంకయ్యన్నా నెమ్మదిగా చుట్టూ చూస్తూ నడు."

"ఏంటి భీమయ్యా! అంత భయం....దొంగ లొస్తారనా? హిహిహి.....రానీ మనదగ్గి రేముందీ?"

"అది కాదన్నా....అదే....ఆ దయ్యం.. మరి డబ్బుకోసం కాదుగా మీదబడేదీ."

"దయ్యం! ఏ దయ్యం? ఏంటయ్యా అలా వణుకుతున్నావు? అరే ఏమయింది?"

"ఏం లేదు వెంకయ్యా! ఇక్కడే ఈ దారి లోనే రెణ్ణెల్లనించీ ఒక దయ్యం తిరుగు తూంది. మొన్ననగా మొన్న మా వూళ్ళో చాకలోణ్ణి ఒక గొల్లవాణ్ణి, నానా తిప్పలు పెట్టింది..."

"అదేమిటి భీమన్నా! మనిషికి ధైర్యం లేకపోతే ఎలా?....ఇదిగో నీకు తోడు నేనున్నా నుగా.. అదంతా ఉట్టి భ్రమన్నా...దయ్యం లేదూ....గియ్యం లేదూ....వూరుకో పద"

భీమన్న మళ్ళీ నడక సాగించాడు. అతని భుజంమీద చెయ్యివేసి వెంకయ్య నడుస్తున్నాడు. వెనక్కూ ముందుకూ చూస్తూ అడు గులో అడుగు వేస్తున్నాడు.

"ఇంకెంతలే భీమన్నా మహా ఉంటే రెండు మైళ్ళుంటుంది...పద" అని ధైర్యం చెబుతున్నాడు వెంకన్న.

ఇప్పటికే భీమన్న ఒళ్ళూ, మనసూ అలసి పోయాయి. నీరసం వచ్చేసింది. జ్వరం వచ్చి కోలుకున్నవాడిలా డీలా పడిపొయ్యాడు.

పక్కనే గుంటలోంచి కప్పలు బెకబెక లాడు తున్నాయి. భీమన్నకు తన గుండెలోనే కప్పలు గంతులు వేస్తున్నట్లనిపించింది.

మూడో మైలు సమీపిస్తున్నారు. అక్కడే బ్రహ్మాండమైన మర్రి.....దాని కొమ్మలు యిటూ అటూ ఊగుతూ పెద్ద శబ్దం జేస్తున్నాయి. ఇదే ఆ దయ్యాల మర్రి. మర్రి చెట్టు భయకరంగా ఉంది. రాత్రి మరీ భయం కరంగా ఉంది. మరి భీమన్నకు మర్రి దగ్గ రవుతూంటే భయం భయంగా ఉంది. వెంక న్నకు మనసులో ఎలా ఉందో పైకి నిబ్బరంగా ఉన్నాడు.

ఆ మర్రి ఊడలను చూస్తుంటే దయ్యం చేతులు చాపినట్టుంది భీమన్నకు. ఆ చెట్టు తొర్ర దయ్యం నోరులా అవుపిస్తున్నది. మర్రి ఆకులు దోవంతా పడిఉన్నాయి. వాటిమీద నడుస్తుంటే ముళ్ళమీద నడిచినట్టుంది

# "మర్రి నవ్వింది"

భీమన్నకు. గాలికి ఆకులు రాలి మీద పడు తుంటే సూదులతో పొడిచినట్టుంది. ఇన్ని ఆలోచనలు ముంచుకొచ్చేటప్పటికి భీమన్న ఒళ్ళు గగుర్పొడిచింది. వణుకు ఎక్కువయింది. ఇంత చల్లగాలిలో కూడా చెమటలు కక్కు తున్నది శరీరం. ఇద్దరూ ఒకరిమీద ఒకరు చేతులు వేసుకు వచ్చేశారు. మర్రి నీడలోకి వచ్చింతర్వాత యింతవరకూ గబ గబ నడు స్తున్న వాడల్లా ఉటూలున ఆగిపోయాడు వెంకయ్య.

భీమన్న గుండె గుభేలు మన్నది.

"బీడీ ఉంటే యియ్యి, భీమన్నా?" ఇంత సేపటి నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ అడిగాడు వెంకయ్య.

చలనంలేని చేతిని జేబులోకి పోనిచ్చి బీడీ తీసిఇచ్చాడు భీమన్న. అది నోట్లో పెట్టుకుని అగ్గిపెట్టెలోంచి పుల్లతీసి వెలిగించాడు వెంకయ్య. ఆరిపోయింది.....రెండోసారి గీచాడు.. అదీ ఆరిపోయింది....అగ్గిపుల్ల వెలుతురులో క్షణంపాటు మర్రివంక చూసి మళ్ళీ అదిరి పడ్డాడు భీమన్న. చలికి వేళ్ళు కొంకర్లు పోతున్నాయి.

"ఏ అగ్గిపెట్టె యివ్వన్నా. ఇందులో పుల్ల లయిపోయినాయి."

భీమన్న అగ్గిపెట్టె ఇచ్చాడు. స్థాణువులా నిలబడి ఆ చెట్టువంక బిత్తర చూపులు చూస్తు న్నాడు. అటూ యిటూ ఊగుతున్న చెట్టు కొమ్మలు, 'కానీ లేవోయ్ భీమన్నా. ఇంకెంత సేపులే. దొరికిపోయావుగా చేతికి' అని అపహ సిస్తున్నట్టనిపించింది. ఇంతలో ఎండుటాకులు మీదపడి చక్కిలిగింతలు పెట్టాయి. పిల్లికి ఎలుకతో చెలగాటం. ఉలిక్కిపడి చుట్టూ చూశాడు భీమన్న. వెంకయ్య లేడు!!!!అయ్యో ఏమయినట్టు.....ఇంతసేపూ ఇక్కడే ఉన్నాడే...



ప్రతిబింబం

చిత్రం—ఎన్. బాబూరావు (విజయవాడ-2)

అతడికి నరనరాలూ చలించిపోతున్నాయి. తాను విన్న దయ్యాల కథలన్నీ జ్ఞప్తికి వస్తున్నాయి. ఉన్నట్టుండి భీమన్నకు పిచ్చి ఆలోచన వచ్చింది. కొంపతీసి దయ్యమే వెంకయ్య వేషంలో వచ్చి తన్ను లాక్కురాలేదు కదా. ఏమో ఎందుకు కాకూడదు! పైగా, తాను వెంకయ్య పాదాలు వెనక్కుతిరిగి ఉన్నాయోమామూలుగానేఉన్నాయో చూడలేదు. ఈ ఆలోచన రాగానే భీమన్న శరీరం కొయ్యబారిపోయింది. క్షణం యుగంలా నడుస్తున్నట్టుంది. ఉన్నట్టుండి దూరంగా ఒక నక్క అరిచింది. భీమన్న తల తిరుగుతున్నది. అతని చెవుల్లో వెయ్యి కీచురాయి పెట్టలూ, వేనకువేలు కప్పలూ చేరి శబ్దం చేస్తున్నట్టు వినవస్తున్నది. కొమ్మలు నిన్ను పట్టేస్తా మన్నట్టు నాట్యం చేస్తున్నాయి. ఇక మనసు నిలువలేదు భీమన్నకు. మళ్ళీ ఒకసారి కలయ జూశాడు. చేతులు విదిలించుకున్నాడు. కాళ్ళు కదిలించాడు. దయ్యం తనను పట్టుకుంటుందని, ఆ వెంకయ్యే దయ్యమని మననం చేసుకుంటూ ఒక్కసారిగా గంతులేసి పొలెంవేపు ఉడాయించాడు వెనక్కి తిరిగి చూస్తూ. మర్రిచెట్టు అట్ట హాసం చేసింది. కొమ్మలూ, ఊడలూ, ఇంకా విర్రవీగినాయి. దీంతో మరింత హడలుపుట్టి దయ్యం తన్ని తరుముకువస్తున్నదని మరింత వేగంగా పరుగుతీశాడు భీమన్న.

ఇంతవరకూ మర్రిచాటున బీడీ వెలిగించు కుని, పనిలో పనిగా లఘుశంక తీర్చుకుని ఇవతలికి వచ్చాడు వెంకయ్య. అక్కడ భీమన్న లేడు!!! ఇంతసేపూ ఇక్కడే ఉన్నవాడు ఎలా మాయమయ్యాడు? తనకు బీడీ, అగ్గిపెట్టె కూడా యిచ్చాడే. చుట్టూ ఒకసారి చూశాడు వెంకయ్య. మళ్ళీ భీమన్న ఆకారం జ్ఞాపకానికి వచ్చింది. ఏవేవో పిచ్చి ఊహలు రాసాగాయి. అంత ధైర్యశాలికీ ఒక్కసారిగా అదురు పుట్టుకువచ్చింది. తను విన్న దయ్యాల కథలన్నీ ఒకదాని వెంట ఒకటిగా మస్తిష్కంలో తరుముకుంటూ వచ్చాయి. ఇంతవరకూ తాను దయ్యాలను చూడలేదు గానీ వాటి ఉనికిలో నమ్మకం లేకపోలేదు. ఇంతవరకూ తనకు ఈ దయ్యాన్ని గురించి చెబుతూ వణికిపోయిన ఈ భీమన్నే దయ్యం కాదు కదా! ఏమో మరి! దయ్యం ఎలాటి ఆకారంలోనైనా రాగలదట.

వెంకయ్య గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. అతడి గుండెల్లో అంతకుముందు లేని భయం చలిజ్వరంలా ముంచుకు వచ్చింది. అతడు మెల్లగా కదిలాడు. ఒకసారి చేతులతో కాళ్ళను తడుముకుని అవి ఉన్నవో లేవో చూసు కున్నాడు. ఇది చూసి ఆ తొర్ర నవ్వుతున్న ట్టనిపించింది.......ఇక ఆలస్యం చెయ్యకూడదని ఒక్కసారిగా 'హై జంప్'చేసి, జారిపడబోయి తమాయించుకొని, పొలెంవేపు కాళ్ళకు బుద్ధి చెప్పాడు వెంకయ్య.

అంతలావు మర్రి పిల్లిద్దర్నీ చూస్తూ మనసుతీర నవ్వుకుంది. ★